పీహెచ్‌సీలో వెక్కిరిస్తున్న ఖాళీలు..

- ఇన్‌చార్జి వైద్యురాలితోనే వైద్యం
- ఏడు సబ్‌సెంటర్లలో ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీ
- ఇబ్బంది పడుతున్న రోగులు


దహెగాంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

దహెగాం: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు మండల కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. అదే విధంగా గ్రామాల్లోని వైద్య సేవలను అందించేందుకు సబ్‌సెంటర్లను సైతం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తోంది. కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్‌సెంటర్లలో పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదు. అసలే సీజనల్ వ్యాధుల బారిన పడి ప్రజలు అల్లాడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సర్కారు వైద్యం అందక ఆర్‌ఎంపీల వద్ద వైద్యం చేయించుకుంటున్నారు. కొందరైతే ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారు.

ఇన్‌చార్జి వైద్యురాలితో..

మండల కేంద్రంలోని ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండగా.. ఇటీవల బదిలీల్లో వైద్యాధికారిని బదిలీపై వెళ్లారు. రెగ్యులర్ వైద్యాధికారిని నియమించకుండా ఇన్‌చార్జి వైద్యాధికారిని నియమించారు. ఆమె వారానికి రెండుసార్లు మాత్రమే వచ్చి వైద్య సేవలు అందిస్తుందని రోగులు ఆరోపిస్తున్నారు. రెగ్యులర్ వైద్యాధికారి లేనందున రోగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావడానికి వెనుకంజ వేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాలుగు స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆసుపత్రిలో ప్రసవాలు జరగడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

ఏడు ఏఎన్‌ఎం పోస్టుల ఖాళీ..

మండలంలో ఏడు సబ్‌సెంటర్లు ఉన్నాయి. సబ్‌సెంటర్లలోని మొదటి ఏఎన్‌ఎం ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్లిన స్థానంలో ఎవరూ కూడా రాక పోవడంతో ఏడు ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల వారికి వైద్య సేవలు అందడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న సిబ్బంది కూడా దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. స్థానికంగా ఉండక పోవడంతో రాత్రి సమయంలో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. అసలే వర్షాకాలం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రజలు ప్రైవేటు ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ వైద్యాధికారిని, సిబ్బందిని నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.

రోడ్లు ఇలా.. వెళ్లేదెలా?


పెంచికల్‌పేట్- సలుగుపల్లి రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

- బురదమయంగా గిరిజన గ్రామాల రోడ్లు
- ప్రజలకు తప్పని తిప్పలు
- మరమ్మతులు చేయాలని వేడుకుంటున్న ప్రయాణికులు

పెంచికల్‌పేట్: మండలంలో గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో రోడ్డు గుండా ప్రయాణించాలనే వాహనదారులు జంకుతున్నారు. వర్షాకాలంలో ప్రతియేటా తిప్పలు తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో రవాణా సౌకర్యాలను కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తున్నామని ప్రభుత్వం, పాలకులు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో సమస్య పరిష్కారం కావడం లేదు.

గుంతలమయంగా రోడ్లు..

- పెంచికల్ పేట్ నుంచి సలుగుపల్లి వెళ్లే ప్రధాన బీటీ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో రోడ్డు చెరువును తలపిస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లోడుపల్లి వద్ద రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. 15 కిలోమీటర్ల ప్రయాణినికి గంటన్నర సమయం పడుతుంది.
- లోడుపల్లి నుంచి కొండపల్లి, కొండపల్లి నుంచి జైహింద్‌పూర్ గ్రామానికి వెళ్లే రహదారి సుమారు మూడు కిలోమీటర్లు ప్రయాణికులు బురదలో ప్రయాణం చేస్తున్నారు.
- దొరోగపల్లి స్టేజీ నుంచి గ్రామానికి వెళ్లే రహదారి రెండు కిలోమీటర్లు బురదమయంగా మారింది.
- అగర్‌గూడ నుంచి గుండెపల్లి, కమ్మర్‌గాం, నందిగామ, మురళీగూడ, జిల్లెడ గ్రామాలకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో సుమారు 15 కిలోమీటర్లు గ్రామస్తులు బురదలో అవస్థలు పడుతున్నారు. గిరిజన గ్రామాలకు 108 వచ్చే పరిస్థితి లేదు.
- ఎల్లూర్ నుంచి మెరెగూడ గ్రామానికి వెళ్లే రహదారి ఐదు కిలోమీటర్లు బురదమయంగా మారడంతో కాలినడకన ప్రయాణం సాగిస్తున్నారు.

గుంతలతో ఇబ్బంది



బీటీ రోడ్డుపైన గుంతలు ఏర్పడటంతో వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. గుంతల రోడ్లతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యవసర సమయంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నాం. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– తెలిగే రమేశ్, ఎల్కపల్లి

రోడ్డు బాగు చేయాలి



మురళీగూడ నుంచి అగర్‌గూడ వరకు రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. బైక్ కూడా వెళ్లలేని పరిస్థితి. గుట్టపైన రోడ్డు వర్షానికి కోతకు గురికావడంతో అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు రాక కాలినడక తప్పడం లేదు. ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు బాగు చేయించాలి.

– రాజేశ్వర్, జిల్లెడ

క్లుప్తంగా

ట్రస్మా కార్యవర్గం ఎన్నిక


మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రైవేట్ పాఠశాలల ట్రస్మా మండల కార్యవర్గాన్ని ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కిషన్ రావు సమక్షంలో ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సందీప్ కుమార్, ఉపాధ్యక్షుడిగా హిదయతుల్ల, కార్యదర్శిగా సురేశ్, కోశాధికారిగా సబీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దేవభూషన్, తిరుపతి, మహేశ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి

కౌటాల: గణేశ్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ రమేశ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ అనుమతి, మైక్ పర్మిషన్ కోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ నుంచి అనుమతి, మండపాల వివరాలను పోలీస్‌పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. పూర్తి వివరాలను కౌటాల పోలీస్‌స్టేషన్‌లో సమర్పించాలన్నారు.

అంకుసాపూర్‌లో వైద్యశిబిరం


వైద్యశిబిరంలో పాల్గొన్న సేవ సమితి సభ్యులు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో ఆదివారం శ్రీమిత్ర సేవ సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి తిరుపతి, డాక్టర్ విద్యాసాగర్, అరుణ్‌బాబు, గౌరవ అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్‌రావు, ఎస్పీఎం యాజమాన్యం ప్రతినిధులు గిరిబాబు, వెంకట్, అమూల్య, పరమేశ్వరరావు, హెల్త్‌సూపర్‌వైజర్ శారద, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా కేసీ గుప్తా జయంతి


కేక్ కట్ చేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

ఆసిఫాబాద్: వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా జయంతిని ఆదివారం జిల్లా కేంద్రంలో క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు కేక్ కట్ చేశారు. అంతకు ముందు కేసీ గుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్లబ్ ఇంటర్‌నేషనల్ ఉపాధ్యక్షుడు ఎకిరాల శ్రీనివాస్ మాట్లాడుతూ కేసీ గుప్తా జయంతి పురస్కరించుకొని ఈనెల 1 నుంచి వారం రోజుల పాటు నిర్వహించాలన్నారు. వాసవీ క్లబ్ సేవలు మరింత విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొలిప్యాక శంకర్, తాటిపెల్లి ఆదిత్య, కోషాధికారి చిలువేరు శ్రీధర్, గుండ బాలేశ్వర్, పాపిని శంకర్, పిన్న వివేక్, ఎకిరాల శంకర్, గుండ ప్రమోద్, రావుల వెంకటేశ్వర్, మురళీధర్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కౌటాల: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌటాల ఎస్సై మధుకర్ ఆదివారం అన్నారు. అత్యవసర పనులుంటే తప్పా ఇంట్లో నుంచి బయటకు వెళ్లవద్దని సూచించారు. పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించిందని, పిల్లలను నీటి కుంటల వద్ద వెళ్లకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. చేపల వేటకు వెళ్లవద్దన్నారు.

వ్యక్తి అదృశ్యం

కాగజ్‌నగర్ రూరల్: మంచిర్యాల జిల్లా నస్పూర్‌కాలనీకి చెందిన కృష్ణకుమార్ సింగ్ (54) అదృశ్యమైనట్లు కాగజ్‌నగర్ పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో నివసం ఉండే కృష్ణ కుమార్‌సింగ్ ఈనెల 30న కాగజ్‌నగర్ పట్టణంలోని నౌగాంబస్తీలో గల బంధువుల ఇంటికి వచ్చాడు. బయటకు వెళ్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. ఈ మేరకు కృష్ణకుమార్ సింగ్ భార్య ఠాకూర్ జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ పేర్కొన్నారు.

శంకర్‌రావు ఆశయాలు కొనసాగిస్తాం

బోథ్: మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో చట్ల శంకర్ రావు వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు శంకర్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రజల పక్షాన నిలబడి ఎన్నో పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి గోవర్ధన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సిరిపురం దాస్, భోజన్న, నరేశ్, శ్రీనివాస్, సుమేర్ పాషా పాల్గొన్నారు.

అధిక లోడ్‌తో కంకర తరలింపు


పరిమితికి మించి కంకర తరలిస్తున్న టిప్పర్

కౌటాల: మండలంలోని ముత్తంపేట శివారులోని క్రషర్ కంపెనీలు రాత్రి, పగలు తేడా లేకుండా టిప్పర్లలో అధికలోడ్‌తో కంకరను తరలిస్తున్నారు. 15 టన్నుల సామర్థ్యంతో తరలించాల్సి ఉండగా.. ఏకంగా 25 నుంచి 30 టన్నుల చేర వేస్తున్నారు. దీంతో రహదారులు గుంతలమయంగా మారుతున్నాయి. టిప్పర్ల వెనుక, పక్కన వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. లోడ్‌పై కవరు కప్పి తరల్సించాల్సి ఉండగా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. రవాణా శాఖ, మైనింగ్, ఇతర అధికారుల నిర్లక్ష్యంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్ల యాజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నూతన కార్యవర్గం


ఎన్నికైన సభ్యులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అధ్యక్షుడు తాటిపెల్లి దిలీప్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావుల శంకర్, ప్రధాన కార్యదర్శిగా రావుల మురళీధర్, కోషాధికారిగా చిలువేరు శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా రావుల వెంకటేశ్వర్, గుండ వెంకటేశ్వర్, ఎకిరాల శంకర్, కొలిప్యాక శంకర్, కాచం వినేశ్, ప్రచార కార్యదర్శిగా కొలిప్యాక రవి, కట్కూరి కిషోర్, సంయుక్త కార్యదర్శులుగా తంగడిపెల్లి రమేశ్, బాశెట్టి అభిలాష్, గోగుల శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా గుండ బాలేశ్వర్, తాటిపెల్లి అశోక్, చిలువేరు వెంకన్న, పుల్లూరి రవీందర్, గుండ ప్రమోద్, రావుల దిలీప్, గంధం వినోద్, బోనగిరి మురళీధర్, ముక్క సంతోశ్, తిరుపతి, తాటిపెల్లి వివేక్, ఎకిరాల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

భారతీయ కళలను పరిరక్షించుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ప్రాచీన భారతీయ కళలను పరిరక్షించుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాల కేంద్రానికి చెందిన చిన్నారులు బాల కేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన నృత్య పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను వీక్షించేందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కళలను, కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. జిల్లాలో కళల అభివృద్ధికి మిట్టు రవి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ప్రమోద్‌కుమార్‌ఖత్రి, రమేశ్ పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి


మాట్లాడుతున్న రితేష్ రాథోడ్

నార్నూర్: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా నాయకులు రితేష్ రాథోడ్ అన్నారు. ఆదివారం మండలంలోని మాన్కాపూర్ సమీపంలోని గజానంద్ జిన్నింగ్ మిల్లులో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎన్నికల విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త బూత్ లెవల్ స్థాయి నుంచి సభ్యత నమోదు నిర్వహించాలన్నారు. భారతదేశంలో హిందుత్వ వాదం నిలబడాలంటే భారత ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమన్నారు. ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్ఞానబ పుష్కర్, ప్రకాష్ బాబూలాల్ రాథోడ్, శేష రావు రాథోడ్ పాల్గొన్నారు.

‘పొలాల’ సందడి


అమ్మకానికి ఉంచిన అలంకరణ, పూజా సామగ్రి


ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ నాయకులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో ఆదివారం పొలాల అమావాస్య సందడి నెలకొంది. అన్నదాతలు బసవన్నలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఇందుకు ఆదిలాబాద్ మార్కెట్లో అలంకరణ, పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు రావడంతో మార్కెట్లో సందడి వాతావరణం కనిపించింది.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో పొలాల అమావాస్య పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉట్నూర్ ఐబీ చౌరస్తాలో మట్టితో ఎద్దుల ప్రతిమలను పూజించి, భారీ ర్యాలీ నిర్వహించారు. ఎద్దుల ప్రతిమలను, గురుగులను చెరువులో నిమజ్జనం చేశారు. నిర్వాహకులు కొత్తపల్లి గంగేశ్ మాట్లాడుతూ మరుగున పడిపోతున్న నేతకాని మహర్ సాంప్రదాయాలను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. నాయకులు దుర్గం సిద్దార్థ, రామ్మూర్తి, వెంకటేశ్, అశోక్, కేశవ్, ప్రేంసాగర్, రవి కిరణ్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వాగులు, వంకలు, చెరువులు కుంటలు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తుడుందెబ్బ, అను బంధ సంఘాల నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ప్రజలను కాపాడాలని కోరారు.

నార్నూర్: మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జాడి రాజలింగు అన్నారు. ఆదివారం పంచాయతీల కార్యదర్శులు, వీఏఆర్‌ఏలు, గ్రామ పంచాయతీ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఎవరైనా ఉంటే వారిని వారి బంధువులు సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. ఎవరూ వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. చేపల కోసం ఎవరు కూడా చెరువుల వద్దకు వెళ్లకూడదన్నారు. ఖాబేఝరి గ్రామ పంచాయతీ పరిధిలో ధన్నుగూడ, మల్లెంగి భారిక్‌రావుగూడ, ఉమ్రీ చిత్తగూడ గ్రామాల ప్రజల అప్రమత్తంగా కోరారు.

ఆదిలాబాద్: జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో జిల్లా ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఒక ప్రకటనలో కోరారు. తడిసిన కరెంటు స్తంభాలను ముట్టుకోవద్దని, అదే విధంగా ఇంట్లో విద్యుత్ పరికరాల పట్ల సైతం జాగ్రత్తగా ఉండాలన్నారు. చెరువు, వాగులు, వంకలను దాటవద్దన్నారు.

ప్రణాళిక ప్రకారమే ఎన్నికలు


మాట్లాడుతున్న అశోక్

ఆదిలాబాద్‌రూరల్: ఎన్నికలు నిష్పక్షపతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయడం జరిగిందని మాల సంక్షేమ సంఘం ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ అశోక్, సుభాష్‌లు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో మాల సంక్షేమ సంఘం ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీర్ అశోక్, సుభాష్, చిన్నన్న ఆధ్వర్యంలో సర్వసభ సమావేశం నిర్వహించారు. మాల సంక్షేమ సంఘం గ్రామ, మండల ఎన్నికల ప్రకటన విడుదల చేయడం జరిగిందన్నారు. సమావేశంలో నాయకులు భూమన్న, దయాకర్, వినోద్, రవి, విశ్వనాథ్, స్వామి, సంటీ రవి, ఆర్ష రమేశ్, అల్లూరు భూమన్న, దాసరి బాబన్న పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందిన వారు సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన గుండు రుక్మకు రూ.22వేల 500, మండలంలోని దేగామ గ్రామానికి చెందిన గాజుల సాయితేజకు మంజూరైన రూ.24వేల విలువ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం నేరడిగొండలోని ఆయన నివాసంలో అందజేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నియోజకవర్గ ప్రజలు వాటి బిల్లులను తీసుకొచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చిక్కాల జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

‘వర్గీకరణ తీర్పు వెనక్కి తీసుకోవాలి’

ఉట్నూర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వెనక్కి తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. చట్టసభల్లో రాజ్యాంగ పరిధిలో కులగణన చేసిన తరువాత జనాభా దామాష పద్ధతిలో వర్గీకరణ చేయాలని, ఎస్సీ వర్గీకరణకు ఉప కులాల వ్యతిరేకించేందుకు ఎస్సీ ఉపకులాల ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతకాని మహార్ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గంగేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, తిరుపతి, స్వామి, బండారి అశోక్, దుర్గయ్య, చంద్రపాల్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలి


మాట్లాడుతున్న హన్మాండ్లు

ఆదిలాబాద్: చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గణేశ్ మండప నిర్వాహకులు ప్రతిఒక్కరూ పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని హిందూ సమాజ ఉత్సవ సమితి అధ్యక్షుడు బొంపెల్లి హన్మాండ్లు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శిశు మందిర్‌లో గణేశ్ మండపాల నిర్వాహకులతో మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, ఐకమత్యంతో జరుపుకోవాలని సూచించారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం ఎటువంటి రుసుం చెల్లించవద్దని, శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్‌తో చర్చించిన అనంతరం ఈ విషయం తెలియజేస్తామన్నారు. సమావేశంలో ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి కోరెడ్డి లెనిన్, సంఘటన మంత్రి ఇత్నూరు భాస్కర్ గౌడ్, కోశాధికారి గందే ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, రాజకుమార్, సభ్యులు కనక నర్సింగ్, తిరుమలేష్, సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ రమేశ్

బోథ్: ప్రజలు గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని బోథ్ సీఐ రమేశ్, ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని షాదీఖానాలో మండలంలోని గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మండపాల వివరాలను ఇవ్వాలన్నారు. నిమజ్జనం సమయంలో ప్రశాతంగా నిమజ్జనం జరిగేలా మండపాల నిర్వాహకులు చూడాలని కోరారు. కార్యక్రమంలో మండలపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగింపు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఔదార్యాన్ని చాటుకున్నారు. తాను నివాసం ఉండే కైలాస్‌నగర్ కాలనీలో పేరుకుపోయిన పిచ్చిమొక్కల తొలగింపు కోసం తనవంతు సాయం అందించారు. పిచ్చిమొక్కలను తొలగించేందుకు అవసరమైన రెండు యంత్రాలను రూ.20వేలతో కొనుగోలు చేయించడంతో పాటు వాటిని క్షేత్రస్థాయిలో పనులు నిర్వహించేందుకు ఇద్దరు కార్మికులను స్వతహాగా నియమించారు. వారికి రూ.10వేల చొప్పున తన సొంత డబ్బులతో వేతనాలను చెల్లించనున్నారు.

నిత్యాన్నదానం అభినందనీయం


భోజనం వడ్డిస్తున్న అలీఖాన్

కైలాస్‌నగర్: పేద ప్రజల ఆకలిని తీర్చేందుకు నిత్యాన్నదానం చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ అమేర్ ఆలీఖాన్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. కంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుపుతున్న నిత్యాన్నదాన కేంద్రాన్ని సందర్శించిన పేదలకు స్వయంగా భోజనం వడ్డించారు. పేదల కోసం కంది అమలు చేస్తున్న సేవలను కొనియాడారు. జిల్లా కేంద్రంలోని పార్టీ శ్రేణులను ఐక్యంగా కలుపుకుపోతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు.